## క్లుప్తంగా

### పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కొమరాడ: మండలంలోని పరశురాంపురం గ్రామ వైఎస్సార్ సీపీ కార్యకర్త చింతాడ శ్రీనివాసరావు తల్లి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి గురువారం ఆ గ్రామం వెళ్లి, శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ పరంగా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

### గాజులు, క్షీర నివేదన పూజలు



రామాలయంలో స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

బలిజిపేట: ధనుర్మాస పూజల్లో భాగంగా వెంగాపురం రామాలయంలో గురువారం స్వామివారికి క్షీరం నివేదన చేసి, గోదాదేవికి గాజులు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు గోపాలకృష్ణ, ఫణికుమార్ శర్మ, సూర్యనారాయణల ఆధ్వర్యంలో ధనుర్మాస పూజలను నిర్వహిస్తున్నారు. ధనుర్మాసంలోని విశేష రోజుల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. 18వ పాశురాన్ని చదివి గాజులు, క్షీరం నివేదన చేసి తిరుప్పావై ప్రకారం దేవిని ఆరాధించారు. ఈ సందర్భంగా ఆలయంలో మహిళలతో పూజలు జరిపించారు. 108కలవ పూలతో స్వామివారికి పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.


### పుష్పాలంకరణలో లక్ష్మీనృసింహ స్వామి



పుష్పాలంకరణలో దర్శన మిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నది ఒడ్డున వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామి గురువారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. లక్ష్మీనృసింహ స్వామివారికి ప్రీతికరమైన రోజు గురువారం కావడంతో స్వామివారిపై ఉన్న నమ్మకంతో ఆలయానికి వచ్చిన భక్తులు ముడుపుల పూజలు నిర్వహించారు. అలాగే ఈ రోజున స్వామివారిని దర్శించుకుంటే కోరికలు తీరుతాయన్న విశ్వాసంతో దూరప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని పూజా సామగ్రితో దర్శించుకుని అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులతో ఆలయ ప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు, అర్చకులు పూజలు చేయించారు. దూర ప్రాంతాల నుంచి ఉపవాసాలతో వచ్చి పూజల్లో పాల్గొన్న భక్తులందరికీ ఆలయ నిర్వాహకులు, అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

### ఎనీమియా నివారణపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న డాక్టర్ పి.పావని

సీతానగరం: మండలంలోని మహిళల్లో హిమోగ్లోబిన్ (ఎనీమియా) లోపాన్ని నివారించడానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పి.పావని అన్నారు. ఈ మేరకు పీహెచ్‌సీలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పీహెచ్‌సీకి వివిధ రకాల అనారోగ్యపరమైన కారణాలతో వచ్చిన వారికి ముందుగా హెచ్‌బీ పరీక్ష నిర్వహించనున్నామని, తదుపరి అనారోగ్యానికి గల కారణాలను తెలుసుకుని వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి మందులు అందజేయనున్నట్లు తెలియజేశారు. ఎనీమియాతో ఎక్కువమంది మహిళలు ఉన్నారని అందుకు అవసరమైన వైద్యసేవలు అందించనున్నామని తెలిపారు.

### ● ఎస్‌ఎంసీలతోనే పాఠశాలల అభివృద్ధి



ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల చైర్మన్ సహకరించాలని ఎంఈఓ ఆర్.ఆనందరావు అన్నారు. వీరఘట్టం బాలికోన్నత పాఠశాలలో ఎస్‌ఎంసీ చైర్మన్లకు, హెచ్‌ఎంలకు గురువారం నిర్వహించిన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. సర్కార్ బడుల బలోపేతానికి ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీలు సంయుక్తంగా చేపట్టాల్సిన కార్యాచరణపై స్టేట్ రిసోర్సుపర్సన్‌లు కురమాన గోవిందరావు, కె.జనార్దనరావు వివరించారు. - వీరఘట్టం

### ● జీడిమామిడిలో సస్యరక్షణపై అవగాహన



గుమ్మలక్ష్మీపురం మండలం, ఎల్విన్‌పేట పంచాయతీ, రేగులపాడు గ్రామంలో జీడిమామిడి పంటలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై ప్రకృతి వ్యవసాయం గుమ్మలక్ష్మీపురం యూనిట్ ఇన్‌చార్జ్ కె.భూషణ్ గురువారం అవగాహన కల్పించారు. ప్రకృతి సాగు విధానాలు అవలంబిస్తూ పంటలో చీడపీడల నివారణ, అధిక దిగుబడులకు ఉపయోగపడే జీవామృతాల తయారీని ప్రయోగాత్మకంగా వివరించారు. పుల్లటి మజ్జిగను చిగురు దశలో ఒకసారి, పూత దశలో మరోసారి, పిందె దశలో ఇంకోసారి ఇలా మొత్తం మూడుసార్లు పిచికారీ చేసుకోవాలని అలాగే పంచగవ్యను ఇదే పద్ధతిలో పిచికారీ చేస్తే జీడిపిక్క నాణ్యంగా ఉండి మంచి బరువును కలిగి ఉంటుందన్నారు. పేడ, ఆవు మూత్రం కూడా అగ్ని, బూజు తెగుళ్ల నివారణకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంటీ నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు. -గుమ్మలక్ష్మీపురం

### ● ప్రయాణికులకు మరింతగా సేవలు



ఆర్టీసీ సంస్థ ద్వారా ప్రయాణికుల సౌకర్యార్థం పాలకొండ డిపో నుంచి నూతనంగా మూడు బస్సులు ప్రారంభించినట్టు డీఎం పి.వెంకటేశ్వరరావు తెలిపారు. పాలకొండలో గురువారం ఈ నూతన వాహనాలను స్థానిక కోటదుర్గమ్మ దేవస్థానం వద్ద సంస్థ ఉద్యోగుల సమక్షంలో ఆయన ప్రారంభించారు. అనంతరం నూతన వాహనాలను డిపోకు తరలించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ నూతన బస్సులు పాలకొండ నుంచి ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నడిపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎఫ్ ఎల్.రాము, ఏఎంఎఫ్ జగన్నాథం, ట్రైల్ ఏడీసీ జీకే మూర్తి, ఎస్.నాగరాజు, బంగారునాయుడు, పీవీ ఆచారి, రాజాబాబు తదితరులు పాల్గొన్నారు. -పాలకొండ రూరల్

# పుచ్చకాయల సాగుకు ఇదే అదును



పుచ్చకాయల సేద్యం (ఇన్‌సెట్లో) టి.అమరేశ్వరి

- మెలకువలతో అధిక దిగుబడులు
- యాజమాన్య పద్ధతులు పాటిస్తే మరింత మేలు
- రైతులకు ఉద్యానవన శాఖాధికారులు సూచన

పాలకొండ రూరల్: రానున్న వేసవి నేపథ్యంలో దాహార్తిని తీర్చే పుచ్చ పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే తగిన మెలకువలతో పాటు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యానవన శాఖాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో పెద్ద ఎత్తున రైతులు పండిస్తున్న సాగు విషయంలో అంతర్ కృషి, నీటి యాజమాన్యం ప్రముఖ పాత్ర వహిస్తాయని చెబుతున్నారు. ఈ నెలలో పుచ్చకాయల పంటు వేయాలనుకున్న రైతులు అవసరమైన మెలకువలపై దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు.

**పుచ్చ సేద్యంలో అంతర్‌కృషి**

పుచ్చ పంటలో కలుపు నివారణలో భాగంగా అంతర్‌కృషి అవసరముంటుందని పాలకొండ ఉద్యానవన శాఖాధికారిణి అమరేశ్వరి అన్నారు. ఇందులో భాగంగా కలుపు నివారణకు పెండిమిథాలియన్ 1.5 లీటర్లు ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పంట వేసిన 48 గంటల్లోగా పిచికారీ చేయడం వలన మంచి ఫలితాలుంటాయన్నారు. ఆకు దశలో మూడు గ్రాములు బోరాక్స్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే మంచి దిగుబడి వస్తుందన్నారు. పూత రావడానికి ముందుగా తీగ చివరిలో తుంచడం వలన పక్క తీగలు పెరిగి దిగుబడి పెరిగేందుకు అవకాశాలుంటాయని సూచించారు. కాయ పెరిగే దశలో వారానికి ఒకసారి కాయలు తిప్పుతూ ఉండాలని తద్వారా మచ్చలు ఏర్పడకుండా కాయ మంచి రూపం చెందుతుందన్నారు.

**ఎరువులు వాడకం**

ఎకరాకు 4 నుంచి 5 టన్నుల వరకు సేంద్రియ ఎరువుల్లో భాగంగా పశువుల ఎరువులను అందించాలని దీంతో పాటు 40 కిలోల భాస్వరం, పొటాషియం 24, నత్రజని 40 కిలోలనిచ్చే ఎరువులు వేయాలని సూచించారు. నాటిన 25 రోజుల తరువాత నత్రజనిని మరోమారు వేసుకోవడం వలన ఉత్తమ ఫలితాలు ఇస్తాయన్నారు.

**నీరు కట్టడం యాజమాన్యం**

పంట మొలకెత్తిన తరువాత 7 నుంచి 10 రోజుల వ్యవధిలో నీరు అందించాల్సి ఉంటుందని, అలాగే కాయలు నేలకు తాకి ఉండడం వలన నీరు కాయకు తగిలితే కుళ్లిపోయే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలన్నారు. కాయ పెరిగే దశలో, మొక్క ఎదిగే దశలో, కాయ పక్వానికి వచ్చే దశలో నీరు కడితే కాయలపై బీటలు వారే ప్రమాదం ఉందన్నారు. దీనిని రైతులు గమనించాలని సూచించారు.

**తెగుళ్ల నివారణ ఇలా..**

పుచ్చపంటలో తెగుళ్లు, పరుగుల నివారణకు, బూజు నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రాములు లేక మోటాలాక్సిల్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి మొక్కలపై పిచికారీ చేయాల్సి ఉంటుందని, బూడిద తెగులు నివారణకు కేరథేన్ లేదా ట్రైడీమార్ఫ్ ఒక మిల్లీలీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కాయకుళ్లు తెగులు నివారణకు మోటాలాక్సిల్ లేదా మాంకోజెబ్ మిశ్రమం 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి అందించాలని, తామర పురుగు నివారణకు ఫిప్రోనిల్ లీటరు నీటికి 2మిల్లీలు చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ తరహా పంట విషయంలో అధికారుల సూచనలు పాటించడంతో దిగుబడులు సాధించవచ్చునని సూచించారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే నిండు ప్రాణాలు బలి



చెముడుగూడలో రమేష్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి

- మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే నిండు ప్రాణాలు బలి అవుతున్నాయని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి విమర్శించారు. మండల కేంద్రంలో 2024 డిసెంబరు 29న జరిగిన కందికొత్తలు ఉత్సవంలో వేడి సాంబారులో పడి చెముడుగూడ గ్రామస్తుడు నిమ్మల రమేష్ మృతి చెందగా, తాడికొండలో అనారోగ్యంతో తోయక ప్రకాష్ చనిపోయాడు. ఈ విషయాలు తెలుసుకున్న ఆమె గురువారం ఆయా గ్రామాలు వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతులకు నివాళులర్పించి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. రమేష్ కుటుంబానికి రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం మండల కేంద్రంలోని హెచ్ గ్రౌండ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఎమ్మెల్యే జగదీశ్వరి, కలెక్టరు ముఖ్య అతిథులుగా పాల్గొన్న కందికొత్తల పండగలో సాంబారులో పడి గిరిజన యువకుడు రమేష్ తీవ్రగాయాలతో భద్రగిరి ఆస్పత్రిలో చికిత్స పొందినా గిరిజన ఎమ్మెల్యేగా సాటి గిరిజనుడి ఆరోగ్యం ఎలా ఉందని పరామర్శించకపోవడం, మెరుగైన వైద్యానికి సిఫార్సు చేయకపోవడం బాధాకరమన్నారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం నిమిత్తం పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రికి రమేష్‌ను తరలించినా ఎంక్వయిరీకి న్యాయమూర్తి వచ్చేంతవరకు ఐసీయూలో ఉంచి, తర్వాత జనరల్ వార్డులోకి మార్చేశారన్నారు. ఆఖరికి విజయనగరం ఆస్పత్రిలో కూడా రమేష్‌కు సరైన వైద్యం అందలేదని, ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రద్ధ వహించి ఉంటే రమేష్ ఇప్పుడు మనమధ్య బతికి ఉండేవాడన్నారు. రమేష్‌కు వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు, ఇద్దరు పిల్లలు, నిండుగర్భిణి అయిన భార్య ఉన్నారన్నారు. రమేష్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, అందివ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే స్వగ్రామమైన తాడికొండకు చెందిన తోయక ప్రకాష్.. చికిత్స నిమిత్తం తాడికొండ పీహెచ్‌సీకి వెళ్తే అక్కడ సరైన సదుపాయాలు లేక.. సకాలంలో వైద్యసేవలు అందక అతడు చనిపోయాడని ఆరోపించారు. ఎమ్మెల్యే సొంత ఊరిలో ఆస్పత్రి సేవలు ఇలాగేనా అని మండిపడ్డారు. నియోజకవర్గంలో 7 నెలల కాలంలో మొత్తం 10 మంది గిరిజన విద్యార్థుల మరణాలు సంభవించాయని, ఆయా ఘటనలపై ఎమ్మెల్యే, అధికారులు ఏం చర్యలు తీసుకున్నారో తెలియజేయాలన్నారు. ఆమె వెంట ఎంపీపీ కె.దీనమయ్య, వైస్ ఎంపీపీ ఎన్.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా పీసా ఎన్నికలు



జియ్యమ్మవలస: బల్లేరులో ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేష్

జియ్యమ్మవలస: మండలంలోని ఆరు గిరిజన గ్రామాల్లో పీసా ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయని ఎంపీడీవో ఎస్.రమేష్ తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాగా ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు ఎన్నికలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఆరు గ్రామాల్లోని 14 హేబిటేషన్లలో మొత్తం 1795 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకుని వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీలను ఎన్నుకున్నారన్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా అడ్డాకుల కిరణ్‌కుమార్(గోర్లి), కొండగొర్రి వెంకటరావు(పాంద్రసింగి), కద్రక బలరాం (కొండచిలకాం),మండంగి రామారావు(ద్రాక్షణి), పువ్వల కోటేశ్వరరావు (బల్లేరు), ఆరిక సురేష్(కొండనిడగళ్లు), గ్రామసభ సెక్రటరీలుగా కొండగొర్రి నగేష్ (కూటాం), బిడ్డిక సురేష్(గోర్లి వలస), బిడ్డిక రవి(కొండచిలకాం వలస), మండంగి అలిబ్బాదు(ద్రాక్షణి ), ఆరిక రాంబాబు(కిడిగేషు), ఆరిక గణపతిరావు (కొండనిడగళ్లు) ఎన్నికయ్యారని పేర్కొన్నారు.



కొమరాడ: పూడేస్ గ్రామంలో పీసా ఎన్నికలు నిర్వహిస్తున్న ఎంపీడీవో మల్లికార్జునరావు

కొమరాడ: మండలంలోని ఏడు పంచాయతీల్లో ఉన్న 20 గ్రామాల్లో పీసా ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయని ఎంపీడీవో మల్లికార్జునరావు తెలిపారు. ఆయా గ్రామాల్లో మొత్తం 4152 మంది ఓటర్లు ఉండగా వారంతా ప్రెసిడెంట్, వైస్ ప్రెసిటెండ్, సెక్రటరీలను ఎన్నుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు నారాయణస్వామి, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం అమ్మకాలపైనే శ్రద్ధ

- తల్లికి వందనంపై లేదు...
- కూటమి ప్రభుత్వంపై మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే కళావతి



వీరఘట్టం: కూటమి ప్రభుత్వానికి మద్యం అమ్మకాలపై ఉన్న శ్రద్ధ తల్లికి వందనం పథకం అమలుపై లేదని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. వండువలో విలేకరులతో గురువారం మాట్లాడారు. గురువారం క్యాబినెట్ సమావేశం జరగడంతో సంక్రాంతి పండగకు తల్లికి వందనం పథకం ప్రకటిస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశగా ఎదురు చూశారని, కానీ ఆ పథకం పేరు కూడా ప్రస్తావించకపోవడం శోచనీయమన్నారు. మద్యం... మద్యం... అంటూ జపం చేస్తున్నారే తప్ప ప్రజలకు ఇచ్చిన హామీలను మాత్రం ఎందుకు నెరవేర్చడం లేదని ఆమె ప్రశ్నించారు. ఎన్నికల హామీలను నెరవేర్చకుండా ప్రజలను మళ్లీ మోసగించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భారీ స్కెచ్ వేస్తున్నారని అన్నారు. హామీలు అమలు చేయలేనప్పుడు ప్రజలకు ఎందుకు మోసపూరితమైన హామీలిచ్చారని ప్రశ్నించారు. తల్లికి వందనం వస్తుందని ఎన్నో ఆశలతో ఓటు వేసిన తల్లులకు పంగనామం పెట్టి మహిళలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఎన్నికల హామీలు కూటమి ప్రభుత్వం నెరవేర్చేలా ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరుడుతుందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని దుయ్యబట్టారు.

# పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

జియ్యమ్మవలస: ఎస్‌ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు కలిసి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ బొంగు సురేష్ కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఎంసీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులతో గురువారం సమావేశమైన ఆయన.. డ్రాపౌట్స్(బడి మధ్యలో మానేసిన పిల్లలు) లేకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. సమావేశంలో తెలియజేసిన ప్రతి విషయాన్ని పాఠశాలలో అమలు చేయాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వండిపెట్టేలా చూడాలని, చదువులో వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధన దిశగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-1 ధనుకొండ గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి, అమలు చేయాలని ఎంఈవో డి.అప్పలనాయుడు సూచించారు. మండలంలోని ఉల్లిభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఎంసీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులతో గురువారం సమావేశమైన ఆయన.. ఎస్‌ఎంసీల విధులు, బాధ్యతలను వివరించారు. ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో పాఠశాల అభివృద్ధి జరగాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌పీలు ఎ.మహేష్, బి.రవికుమార్, జి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: మాట్లాడుతున్న ఎంఈవో అప్పలనాయుడు

# వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

గుమ్మలక్ష్మీపురం: గిరిజనులకు వైద్యసేవలు అందజేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని వైద్యారోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు హెచ్చరించారు. మండలంలోని ఇరిడి, లిక్కిడి, మండ, పి.ఆమిటి తదితర గ్రామాలను ఆయన గురువారం సందర్శించి, గ్రామాల్లో చేపడుతున్న ఆరోగ్య సర్వేలు ఏ మేరకు వచ్చాయన్న విషయాలపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారం వారికి సక్రమంగా అందేలా చూడాలన్నారు. పి.ఆమిటి గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాల సందర్శనలో విద్యార్థుల హిమోగ్లోబిన్ పరీక్షల వివరాల రికార్డులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జయగౌడ్, ఎర్రాయమ్మ, హెచ్‌ఎం పార్వతి పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న వైద్యారోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భామిని: భామిని మండలంలో 11 కేవీ లైన్ గురండి ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురండి, బిల్లుమడ, నేరడి, లోహరిజోల, కాత్రగడ, నులకజోడు గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్టు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

# పత్తి పంటకు కలిసి రాని వర్షాలు



బిల్లుమడ వద్ద పాత కాపుతోనే పెరుగుదల లేని పత్తి పంట

భామిని: ఇటీవల కురిసిన వర్షాలు రైతులకు ప్రయోజనం లేకుండా పోయాయి. గత వారం రోజులుగా పత్తి పంట మొలకెత్తడంపై అంతగా ప్రభావం చూపడం లేదు. ప్రస్తుతం గతంలో పూసిన పూతలే తప్ప కొత్త పూత కనిపించడం లేదు. పత్తి మొక్కల్లో పచ్చదనం కనిపించడం లేదు. గతంలో వర్షాలు చాలా కాలం మొహం చాటేయడంతో పత్తి మొక్కల్లో పెరుగుదల లేకుండా పోయిందని రైతులు పేర్కొంటున్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



నూతనంగా ఎన్నికైన మండల ఎస్‌ఎఫ్‌ఐ కమిటీ

సీతంపేట: విద్యారంగ సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు తేజ, మంజు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గాన్ని గురువారం సీతంపేటలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన మహాసభలను ఉద్దేశించి మాట్లాడారు. హానర్స్ మేజర్ డిగ్రీ, మైనర్ డిగ్రీ రద్దు చేయాలన్నారు. సీతంపేటలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. హెల్త్ వలంటీర్‌లను నియమించాలని కోరారు. కార్యక్రమంలో అఖిల, దిలీప్, పృథ్వీ పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి కృషి చేయాలి

భామిని: విద్యాభివృద్ధికి పాఠశాల నిర్వహణ కమిటీలు కృషి చేయాలని ఎంఈఓలు ఎ.శ్రీనివాసరావు, పూయక భాస్కరరావు అన్నారు. ఏపీ మోడల్ స్కూల్‌లో గురువారం నిర్వహించిన పాఠశాలల నిర్వహణ కమిటీ చైర్మన్లు, హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడారు. కమిటీ బాధ్యతలు, బాలల హక్కులు, తల్లిదండ్రుల పాత్ర వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. రిసోర్సుపర్సన్లు తిరుపతిరావు, ధనుంజయ, ప్రసాద్ అంశాల వారీగా వివరించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శివకుమార్, కమిటీ చైర్మన్లు, హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ భాస్కరరావు